TGTEL/25/A4812

వాయిస్ ఆఫ్
# వందే భారత్
Voice of Vande Bharath
తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 51 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ మంగళవారం | జూన్ 02, 2026




2లో..

## అమరవీరుల త్యాగాల ఫలితమే తెలంగాణ

- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా
- రాజ్ భవన్‌లో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు
- జాతీయ జెండా ఆవిష్కరణ

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనేది అమరవీరుల నిరుపమాన త్యాగాలకు, దశాబ్దాల పాటు సాగిన ఉధృత ప్రజాస్వామ్య పోరాటాలకు సజీవ ప్రతీక అని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రాజ్‌భవన్‌లో (లోక్‌భవన్) వేడుకలను అత్యంత అధికారికంగా, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, సాయుధ పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు ఆయన భావోద్వేగంతో ఘన నివాళులర్పించారు. ఈ అరుదైన సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలందరికీ, దేశ విదేశాల్లో స్థిరపడిన తెలంగాణ బిడ్డలందరికీ గవర్నర్ తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

## రాజకీయాలకతీతంగా తెలంగాణ అభివృద్ధి

- మంత్రి పొన్నం ప్రభాకర్
- త్వరలోనే తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి గౌరవిస్తాం
- సిద్దిపేటలో అట్టహాసంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు
- జాతీయ జెండా ఆవిష్కరించిన మంత్రి



2లో..

## సంక్షేమం నుంచి సంక్షోభంలోకి తెలంగాణ

- కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- తెలంగాణ భవన్‌లో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం
- జాతీయ జెండా ఆవిష్కరించిన కేటీఆర్



2లో..

## జనసేన పుట్టిందే తెలంగాణలో..

- ఇక్కడి ఎన్నికల్లో పోటీ చేసి తీరుతాం!
- ఇంకెంత కాలం ఆంధ్రావాళ్లను తిడుతూ కాలక్షేపం చేస్తారు?
- తెలంగాణ ఎవరి అబ్బ జాగీరు కాదు..
- తాటాకు చప్పళ్లకు భయపడే ప్రసక్తే లేదు
- ఫామ్‌హౌస్ కబ్జా అని నిరూపిస్తే ప్రభుత్వానికే రాసిస్తా
- ప్రెస్‌మీట్‌లో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ గడ్డపై జనసేన పార్టీ ఎప్పటికీ ఉంటుందని, రాబోయే ఇక్కడి ఎన్నికల్లో కచ్చితంగా పోటీ



2లో..

చేసి తీరుతామని ఆ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుండబద్దలు కొట్టారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన అత్యంత ఆవేశంగా మాట్లాడారు. తెలంగాణ 13వ ఏట అడుగుపెడుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, లక్షలాది మంది జనసేన సైనికులకు ఆయన ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్రంలో కాంగ్రెస్‌కు తిరుగు లేదు..

- మాకు ప్రత్యర్థులే లేరు!
- కేబినెట్ అంతా ఒక జట్టుగా నూరు శాతం చిత్తశుద్ధితో పనిచేస్తోంది
- జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపుపై ప్రభుత్వం చాలా బలంగా ఉంది
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**ఖమ్మం, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేదని, రాబోయే ఎన్నికల్లో తమతో పోటీ పడే ప్రత్యర్థులే లేరని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ అవతరణ వేడుకల అనంతరం ఆయన ఖమ్మంలో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ప్రస్తుత కాంగ్రెస్ మంత్రివర్గం రాష్ట్ర ప్రయోజనాల కోసం ఒక టీమ్‌లా అద్భుతంగా పనిచేస్తోందని కొనియాడారు.



2లో..

## తెలంగాణ నిరుద్యోగులకు శుభవార్త

### ఆర్ అండ్ బీలో 222 ఖాళీ ఇంజనీర్ల భర్తీ

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మరో కీలక నోటిఫికేషన్ విడుదల చేసింది. ముఖ్యంగా ఇంజనీరింగ్ విద్యార్హత కలిగిన అభ్యర్థులకు ఇది మంచి అవకాశంగా మారనుంది. రోడ్లు, భవనాల శాఖలో మొత్తం 222 ఖాళీల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నోటిఫికేషన్‌లో భాగంగా 49 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టులు, 19 ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. అర్హులైన అభ్యర్థుల నుంచి జూన్ 18 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఎఇఇ పోస్టులకు జూలై 13 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండగా, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టులకు జూలై 15 వరకు గడువు కల్పించారు. అభ్యర్థులు అధికారిక నోటిఫికేషన్‌లో పేర్కొన్న అర్హతలు, వయోపరిమితి, ఇతర నిబంధనలను పరిశీలించి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

# రాజకీయాలకతీతంగా తెలంగాణ అభివృద్ధి

- మంత్రి పొన్నం ప్రభాకర్
- త్వరలోనే తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి గౌరవిస్తాం
- సిద్దిపేటలో అట్టహాసంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు
- జాతీయ జెండా ఆవిష్కరించిన మంత్రి

**సిద్దిపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్ర సమగ్ర ప్రగతి కోసం రాజకీయ పార్టీలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన అధికారిక వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రగతి నివేదికను చదివి వినిపించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరికీ తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంలోని 'ఆర్టికల్ 3' వల్లే నాడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ అనేది కేవలం ఒక భౌగోళిక ప్రాంతం మాత్రమే కాదని, అది కోట్లాది మంది ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని ఉద్ఘాటించారు. ఎందరో మహానుభావుల త్యాగాల పునాదులపై నిర్మితమైన తెలంగాణ, నేడు ప్రగతికి, సంక్షేమానికి చిరునామాగా నిలిచిందన్నారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అసలైన తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, వారిని ప్రభుత్వం తరపున ఘనంగా గౌరవిస్తామని మంత్రి ఈ సందర్భంగా మాటిచ్చారు. జిల్లా కేంద్రంలో వేడుకల అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ నియోజకవర్గంలో పర్యటించారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేసిన ఆయన, అనంతరం స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద జరిగిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమాలలో జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# అమరవీరుల త్యాగాల ఫలితమే తెలంగాణ

- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా
- రాజ్ భవన్‌లో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు
- జాతీయ జెండా ఆవిష్కరణ



**(మొదటి పేజీ తర్వాత..)** ఆధునిక తెలంగాణ నిర్మాణానికి, అభివృద్ధికి పునాదులు వేసిన ప్రతి ఒక్కరినీ ఈ రోజు స్మరించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని ఆయన పిలుపునిచ్చారు. తన ప్రసంగంలో 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అనే సంస్కృత సూక్తిని ప్రస్తావిస్తూ.. ప్రతి ఒక్కరికీ తమ జన్మభూమి స్వర్గం కంటే గొప్పదని గవర్నర్ పేర్కొన్నారు. శతాబ్దాల నాటి తెలంగాణ విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలు, గ్రామీణ వ్యవసాయ వారసత్వం ఈ నేల యొక్క అసలైన జీవనాడిగా నిలిచాయని కొనియాడారు. నాడు కాకతీయుల కాలం నాటి గొలుసుకట్టు చెరువుల వైభవం నుంచి.. నేటి ఆధునిక సాగునీటి ప్రాజెక్టుల వరకు రైతాంగం రాత్రింబగళ్లు చేసిన కృషితోనే తెలంగాణ సస్యశ్యామలంగా మారిందని ప్రశంసించారు. ఒకవైపు వ్యవసాయ రంగంతో పాటు, మరోవైపు ఐటీ, ఫార్మా, స్టార్టప్ వంటి ఆధునిక రంగాలలో కూడా తెలంగాణ అంతర్జాతీయ పటంలో ప్రత్యేక గుర్తింపు సాధించడం అత్యంత గర్వకారణమన్నారు. రాజ్యాంగ విలువలు, 'సర్వేజనా సుఖినోభవంతు' అనే ఆదర్శ స్ఫూర్తితోనే రాష్ట్ర ప్రగతి సాగాలని గవర్నర్ ఆకాంక్షించారు. గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి, సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమం సమపాళ్లలో సాగుతూ సుసంపన్నమైన నవ తెలంగాణ నిర్మాణం జరగాలని కోరారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రం మరింత ఆర్థిక, సామాజిక వృద్ధిని సాధించి దేశ ప్రగతిలో కీలకమైన పాత్ర పోషించాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ అధికారిక వేడుకల్లో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, సంయుక్త కార్యదర్శి శశికిరణా చారి, రాజ్ భవన్ ఉన్నతాధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# జనసేన పుట్టిందే తెలంగాణలో..

**(మొదటి పేజీ తర్వాత..)**

జనసేన పార్టీ ఊపిరి పోసుకున్నదే తెలంగాణ గడ్డపై అని, 2007–08 నాటి 'యువరాజ్యం' నుంచే ఇక్కడి కేడర్ అంతా తనతో నడుస్తోందని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో తనకేం పని అంటూ కొందరు స్థానిక నాయకులు ప్రశ్నించడంపై పవన్ కళ్యాణ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "నన్ను బెదిరించడానికి మీరెవరు? తెలంగాణ ఏమైనా మీ అయ్య జాగీరా?" అంటూ సూటిగా నిలదీశారు. రాష్ట్రంలోని రాజకీయ నిరుద్యోగ నాయకులు ఇప్పటికీ ఆంధ్రా వాళ్లను తిడుతూ కాలక్షేపం చేస్తున్నారని పవన్ విమర్శించారు. "ఇంకెంత కాలం ఈ తిట్లు? ఇక్కడ ఉపాధి లేకపోవడానికి నేనేమైనా కారణమా? మద్రాస్ నుంచి చిత్రపరిశ్రమ ఇక్కడికి ఎలా వచ్చింది? ఇక్కడ ఏపీ కాంట్రాక్టర్లు బాగానే ఉన్నారు కదా.. సడెన్‌గా ఆంధ్రా వాళ్లను వెళ్లిపోమంటే ఎలా?" అని ప్రశ్నించారు. దేశంలో, ప్రపంచంలో ఎన్నో చోట్ల తెలుగువారు స్థిరపడ్డారని, వాళ్లందరినీ అక్కడి నుంచి వెళ్లిపోమనడం కరెక్టేనా అని నిలదీశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తనకు పూర్తి గౌరవం ఉందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అలాగే, తన ఫామ్‌హౌస్ చెరువును కబ్జా చేసి కట్టారని కొందరు చేస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ.. కబ్జా అని నిరూపిస్తే ఆ ఫామ్‌హౌస్‌ను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వానికి రాసిస్తానని సవాల్ విసిరారు. ఇదిలావుండగా, జూబ్లీహిల్స్‌లోని పవన్ కళ్యాణ్ నివాసం వద్ద మంగళవారం భారీ ఉద్రిక్తత నెలకొంది. జనసేన తలపెట్టిన 'జన సంకల్ప సభ'కు పోలీసులు అనుమతి నిరాకరించడంతో ఆగ్రహించిన అభిమానులు, కార్యకర్తలు పవన్ నివాసానికి భారీగా చేరుకున్నారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో ప్రభుత్వం, పోలీసులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో ఆ ప్రాంతంలో కాసేపు ఉత్కంఠ వాతావరణం చోటుచేసుకుంది.

# రాష్ట్రంలో కాంగ్రెస్‌కు తిరుగు లేదు..

- మాకు ప్రత్యర్థులే లేరు!
- కేబినెట్ అంతా ఒక జట్టుగా నూరు శాతం చిత్తశుద్ధితో పనిచేస్తోంది
- జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపుపై ప్రభుత్వం చాలా బలంగా ఉంది
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



**(మొదటి పేజీ తర్వాత..)** క్షేత్రస్థాయిలో పనిచేసే ప్రభుత్వాలకు ఆర్భాటపు ప్రచారాలు అవసరం లేదని, ప్రజలకు సేవ చేయడమే తమ మొదటి ప్రాధాన్యతని స్పష్టం చేశారు. ఇప్పటికే అసెంబ్లీ, లోక్‌సభ, మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ తన సత్తా చాటుకుందని గుర్తు చేస్తూ.. ప్రస్తుత ప్రభుత్వ పాలనకు తాను వంద శాతం మార్కులు వేస్తానన్నారు. ఇదే ఊపుతో రాబోయే జిల్లా పరిషత్ ఎన్నికలపై కూడా ప్రభుత్వం త్వరలోనే సరైన నిర్ణయం తీసుకుంటుందని, 2028 అసెంబ్లీ ఎన్నికల్లో తమకు ఎదురే ఉండదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 'రాజీవ్ ఆరోగ్యశ్రీ' పథకం అత్యంత అద్భుతంగా నడుస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. పేదలకు రూ. 10 లక్షల వరకు వైద్య బీమా కల్పించే ఈ పథకం సజావుగా సాగడం కోసం ప్రభుత్వం ప్రతి నెలా రూ. 150 కోట్ల నిధులను విడుదల చేస్తోందని వెల్లడించారు. వైద్య సేవలను మరింత బలోపేతం చేయడానికి వీలుగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులలో కొత్తగా 10 వేల బెడ్‌లను పెంచుతున్నట్లు ఆయన ప్రకటించారు. అలాగే, రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ కరెంట్ మీటర్లు పెట్టబోమని, ఉచిత కరెంట్ అందించి తీరుతామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువస్తున్న 'ఇందిరమ్మ జీవిత బీమా పథకం' లబ్ధిదారులందరికీ ఎంతో ప్రయోజనకరంగా మారుతుందని భరోసా ఇచ్చారు. తెలంగాణలో జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు కేటాయించే అంశంపై ప్రభుత్వం చాలా బలంగా ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. జర్నలిస్టుల ఇళ్ల సమస్య పరిష్కారం కోసం ప్రత్యేకంగా అధికారులు పనిచేస్తున్నారని, దీనిపై ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇదే సమయంలో సమాజంలో ఓట్ల గల్లంతు వ్యవహారంపై మీడియా ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, మ్యాపింగ్ ప్రక్రియలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు. ధాన్యం కొనుగోళ్లపై బీజేపీ నాయకులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లపై భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పూర్తిగా రైతు వ్యతిరేక ప్రభుత్వమని, ధాన్యం సేకరణ వైఫల్యం మమ్మాటికీ కేంద్రానిదేనని ధ్వజమెత్తారు. దేశంలో మొదటి నుండి గోదాములలో స్టాక్ ఉంచడం నేరమైనప్పటికీ, బీజేపీ ప్రభుత్వం మాత్రం కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చేలా వ్యవహరించిందని ఆరోపించారు. తెలంగాణ బీజేపీ నేతలు ఇక్కడ రాజకీయం మాట్లాడటం మానేసి, కేంద్రం ద్వారా ముందుగా ధాన్యం కొనుగోళ్లు జరిగేలా చూడాలని డిప్యూటీ సీఎం గట్టిగా హితవు పలికారు.

# సంక్షేమం నుంచి సంక్షోభంలోకి తెలంగాణ

- కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- తెలంగాణ భవన్‌లో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం
- జాతీయ జెండా ఆవిష్కరించిన కేటీఆర్

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ భవన్‌లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బీఆర్ఎస్ శ్రేణులు అత్యంత ఘనంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు తొలుత తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, అమరవీరులకు ఘన నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఇదే తరుణంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి బీఆర్ఎస్ నేతలు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఉత్సవాల్లో భాగంగా పలువురు తెలంగాణ కళాకారులను కేటీఆర్ శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పార్టీ శ్రేణులను ఉద్దేశించి కేటీఆర్ ప్రసంగిస్తూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఒకప్పుడు దేశానికే అభివృద్ధి, సంక్షేమాలకు రోల్ మోడల్‌గా నిలిచిన తెలంగాణ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడిందని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో కేసీఆర్ పోషించిన చారిత్రాత్మక పాత్రను కేటీఆర్ గుర్తుచేశారు. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అనే నినాదంతో మృత్యువు నోట్లోకి వెళ్లి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన అజేయ శక్తి కేసీఆర్ అని కొనియాడారు. కేసీఆర్ జీవిత గాథపై సినిమా తీస్తానంటూ గతంలో ఓ దర్శకుడు తనను కలిసిన సందర్భాన్ని గుర్తుచేస్తూ.. కేసీఆర్ అనే మూడు అక్షరాల ముందు 'ముఖ్యమంత్రి' అనే పదవి చాలా చిన్నదని సదరు దర్శకుడు వ్యాఖ్యానించినట్లు పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాను దశాబ్దాల పాటు పీడించిన ఫ్లోరైడ్ రక్కసిని మిషన్ భగీరథ ద్వారా శాశ్వతంగా తరిమికొట్టి, ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించిన భగీరథుడు కేసీఆర్ అని స్పష్టం చేశారు. ప్రస్తుత రాజకీయ, పరిపాలనా పరిస్థితులపై కేటీఆర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. "నాడు కేసీఆర్ పాలనలో పుష్కర తెలంగాణగా వెలిగిన రాష్ట్రం.. నేడు ముష్కరుల, నిష్ఫల తెలంగాణగా మారిపోయింది" అని తీవ్రంగా విమర్శించారు. అడ్డగోలు గ్యారంటీల హామీలతో అడ్డదారిలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, రాష్ట్ర ఆర్థిక, పరిపాలనా వ్యవస్థలను పూర్తిగా నాశనం చేసిందని ధ్వజమెత్తారు. "మేము వడ్డించిన విస్తరి లాంటి తెలంగాణను ఇస్తే.. ప్రస్తుత పాలకులు దాన్ని కుక్కలు చింపిన విస్తరిగా మార్చుతున్నారు" అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. గత 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒంటరిగానే ఘన విజయం సాధించిందని, 2023లో కేవలం స్వల్ప ఓట్ల తేడాతోనే ప్రతిపక్షాల మాయమాటల వల్ల ఓడిపోయామని కేటీఆర్ విశ్లేషించారు. అయితే ఈ కాంగ్రెస్ మార్కు అరాచక పాలన ఎంతో కాలం సాగదని, రాబోయే 2028 డిసెంబర్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు మళ్లీ బీఆర్ఎస్‌కు పట్టం కట్టడం, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్య నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
మంగళవారం, జూన్ 02, 2026

## రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్ర అవతరణ వేడుకలు

**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. హనుమకొండలోని రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షులు ఎన్.రవి ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు, శాశ్వత సభ్యులు అందరికీ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ప్రజలకు అందుతున్న వైద్య, సామాజిక సేవలలో నిరంతరం విశేష కృషి చేసిన పలువురు సిబ్బందిని ఈ సందర్భంగా గుర్తించి ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. అదనపు కలెక్టర్ ఎన్. రవి, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్న వారిలో ఆనంద్ కుమార్ (ల్యాబ్ టెక్నీషియన్), శీతల్ (ఫార్మసిస్ట్), ఉపేందర్ (ఫార్మసిస్ట్), శిరీష (చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్)లు ఉన్నారు. ఈ సంబరాలలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ పి.విజయచందర్ రెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈ.వి.శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పొట్లపల్లి శ్రీనివాస్ రావు, శాశ్వత సభ్యులు బొల్లం శివ, మధు, జి.రవి, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అట్టహాసంగా 'తెలంగాణ ఆవిర్భావ' దినోత్సవం

**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అచ్చంపేట పట్టణంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో అచ్చంపేట నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని సందడి చేశారు. ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం, మున్సిపల్ ఆఫీస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం, అంబేద్కర్ చౌరస్తా, తహసిల్దార్ కార్యాలయం, ఆర్డీవో ఆఫీస్, పబ్లిక్ క్లబ్ మరియు అమరవీరుల స్తూపం తదితర ముఖ్య కూడళ్ల వద్ద ఎమ్మెల్యే వంశీకృష్ణ చేతుల మీదుగా జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ ఘన నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన వివిధ సమావేశాల్లో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనేది నాలుగున్నర కోట్ల ప్రజల స్వాభిమానానికి ప్రతీక అని కొనియాడారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు, ఉద్యమకారుల పోరాటం ఎప్పటికీ చిరస్మరణీయమని పేర్కొన్నారు. నాడు ఉద్యమకారులు ఏ ఆశయాల కోసమైతే పోరాడారో, వాటికి అనుగుణంగానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజా పాలనలో ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందిస్తూ ఉద్యమ ఆశయాలను నెరవేర్చడమే అమరవీరులకు మనం ఇచ్చే నిజమైన



నివాళి అని ఆయన అన్నారు.ఈ విస్తృత కార్యక్రమాల్లో గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రాజేందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత మల్లేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గోపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ రామనాథం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుచ్చి రాములు, ఎస్సీ సెల్ తాలూకా అధ్యక్షులు రాజగోపాల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ మహిళా నాయకురాలు శారదమ్మ పాల్గొన్నారు. వీరితో పాటు పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేశారు.

## రాష్ట్రస్థాయి పోటీల్లో రిక్కి తేజకు ప్రథమ స్థానం

**వంగూరు, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం'లో భాగంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ పోటీలలో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థి సంచలన విజయం సాధించాడు. వంగూరు మండలం తుమ్మలపల్లి ఉన్నత ప్రాథమిక పాఠశాలకు చెందిన రిక్కి తేజ జూనియర్ విభాగంలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని, తన అద్భుత ప్రతిభను చాటుకున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి హోరాహోరీగా సాగిన ఈ పోటీలలో రిక్కి తేజ తన వినూత్న ఆలోచనలు, సృజనాత్మకతతో అద్భుతమైన కళాఖండాన్ని రూపొందించాడు. విద్యార్థి ప్రదర్శించిన కళాత్మక నైపుణ్యం న్యాయనిర్ణేతలను ఎంతగానో ఆకట్టుకోవడంతో అతడికి ప్రథమ బహుమతి లభించింది. ఈ అరుదైన విజయం ద్వారా విద్యార్థి తన పాఠశాలకే కాక వంగూరు మండలానికి, నాగర్‌కర్నూల్ జిల్లాకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చాడు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ చేతుల మీదుగా రిక్కి తేజ ప్రశంసా పత్రం, మెమెంటోను అందుకున్నాడు. విద్యార్థిలోని ప్రతిభను డైరెక్టర్ ప్రత్యేకంగా కొనియాడుతూ, భవిష్యత్తులో జాతీయ స్థాయిలో మరిన్ని



ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. రిక్కి తేజ సాధించిన ఘన విజయంపై నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్, తుమ్మలపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, గ్రామస్తులు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సరైన ప్రోత్సాహం, అవకాశాలు కల్పిస్తే రాష్ట్రస్థాయిలోనే కాకుండా దేశవ్యాప్తంగా ప్రతిభ చాటగలరని ఈ విజయం నిరూపించిందని స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు కొనియాడారు. విద్యార్థిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

## ఇసుక రవాణాకు సరికొత్త నిబంధనలు

### నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలు సీజ్

**చిట్యాల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మండల పరిధిలోని ఇసుక క్వారీల నుంచి ఇసుక రవాణా చేసే వాహనదారులకు జిల్లా యంత్రాంగం కీలక ఆదేశాలు జారీ చేసింది. మంగళవారం చిట్యాల తహసీల్దార్ కార్యాలయంలో ఎంఆర్ఓ వసంత్ రావు, ఎంపీడీఓ జయశ్రీ, ఏఎంవిఐ తహిమ సుల్తానా, స్థానిక ఎస్సై పోచంపల్లి సతీష్ సంయుక్తంగా అత్యవసర సమావేశం నిర్వహించి నూతన నిబంధనలు, ధరలను అధికారికంగా ప్రకటించారు. గతంలో ఉన్న 'ఇందిరమ్మ కూపన్లు' స్థానంలో ఇకపై తహసీల్దార్ కార్యాలయంలో నేరుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ట్రాక్టర్ యజమానులు తమ వాహనం ఇంజన్ నంబరు, ట్రాలీ నంబరు, ఇన్సూరెన్స్, డ్రైవర్ యొక్క డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలతో తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలి. ఇసుకను కేవలం భూపాలపల్లి నియోజకవర్గం పరిధిలో మాత్రమే రవాణా చేయడానికి అనుమతి ఉంది. ఈ సందర్భంగా చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మరియు జిల్లా యంత్రాంగం నిర్ణయించిన ధరల కంటే అధికంగా వసూలు చేసినా, ఎలాంటి పత్రాలు లేకుండా అక్రమంగా రవాణా చేసినా వాహనాలను సీజ్ చేసి, బాధ్యులపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అధికారులు నిర్ణయించిన నిర్దేశిత ధరల కంటే ఎవరైనా లబ్ధిదారులు లేదా ట్రాక్టర్ నిర్వాహకులు ఎక్కువ డిమాండ్ చేస్తే.. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు ప్రజలను కోరారు.

## ఆత్మగౌరవానికి ప్రతీక స్వరాష్ట్ర ఆవిర్భావం

### మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

**డోర్నకల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ ప్రజల 60 ఏళ్ల ఆకాంక్ష, ఆత్మగౌరవం నెరవేరి, మువ్వన్నెలతో పాటు గులాబీ జెండా సగర్వంగా ఎగిరిన రోజే స్వరాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని డోర్నకల్ పట్టణంలో ఆయన బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్థానిక ఒక వేడుకల మందిరంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఉద్యమ నాయకుడు కేసీఆర్ అలుపెరగని పోరాటం, సబ్బండ వర్గాల సుదీర్ఘ ఉద్యమాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం పురుడు పోసుకుందని రెడ్యానాయక్ గుర్తుచేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటూ.. సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిపి ఆదర్శంగా మార్చామన్నారు. అమరవీరుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, తెలంగాణ అస్తిత్వం మరియు ఆత్మగౌరవ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు విద్యాసాగర్, బాలు నాయక్, రాము, శరత్, రమేష్, చంటి, గౌస్, భిక్షం రెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రశాంత్, బాబు, తురక అనిల్, సుధాకర్, భాషా, మధు, పార్టీ శ్రేణులు, యువత పాల్గొన్నారు.

## ఉప్పరపల్లిలో మిన్నంటిన సంబరాలు

**ఉప్పునుంతల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం ఉప్పరపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ బొజ్జ గీతా అమరేందర్ రెడ్డి చేతుల మీదుగా జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజాప్రవాసి కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బొజ్జ అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. నీరు, నిధులు, నియామకాలే లక్ష్యంగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రంలో నేడు ప్రజలకు ఆ ఫలాలు అందుతున్నాయంటే నాడు ప్రాణాలర్పించిన మహనీయుల ఆత్మబలిదానాలే కారణమన్నారు. అమరవీరులకు మనం ఇచ్చే నిజమైన నివాళి పిల్లలకు నాణ్యమైన చదువును అందించడమేనని స్పష్టం చేశారు. స్వరాష్ట్రంలో యువత అన్ని రంగాల్లో ఎదగడానికి విద్యే మూలస్తంభమని, అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేస్తోందని ఆయన గుర్తుచేశారు.సర్పంచ్ బొజ్జ గీతారెడ్డి మాట్లాడుతూ.. భారతదేశానికి స్వాతంత్ర్య దినోత్సవం ఎంత ప్రాముఖ్యమైనదో, మన రాష్ట్రానికి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం అంతకంటే ప్రత్యేకమైనదని కొనియాడారు. ఎన్నో ఏళ్ల నిరీక్షణ, ఉధృత ఉద్యమాలు, ప్రాణ



త్యాగాల ఫలితంగానే స్వరాష్ట్ర కల సాకారమైందన్నారు. వేడుకల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు ఉచితంగా స్కూల్ యూనిఫామ్‌లను అందజేశారు. ఈ సంబరాలలో డిప్యూటీ సర్పంచ్ శ్రీనివాస చారి, గ్రామ వార్డు సభ్యులు లక్ష్మీ మల్లయ్య, పానుగంటి పర్వతాలు, గడిల రేణమ్మ వెంకటేష్, పానుగంటి సువర్ణ ఆంజనేయులు, ఎడ్ల వెంకటయ్య, భారతమ్మ శేఖర్ రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు జీపీ సెక్రటరీ ప్రదీప్ రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణాకర్, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల అధ్యక్షులు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మొకురాల పరమేష్ గౌడ్, నాయకులు భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, దామోదర్ రెడ్డి, రాజు, పటపర్ల రమేష్, సోషల్ మీడియా ఇంచార్జ్ కేశమోని శేఖర్ గౌడ్, గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

4

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్

VOICE OF
VANDE BHARATH
మంగళవారం, జూన్ 02, 2026

# సోనియా గాంధీ వల్లే తెలంగాణ సాధ్యమైంది

■ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్ మధు



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్ మధు ఆధ్వర్యంలో స్థానిక అమరవీరుల స్థూపం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తుమ్ మధు మాట్లాడుతూ.. తెలంగాణలోని నాలుగున్నర కోట్ల ప్రజల దశాబ్దాల చిరకాల వాంఛ కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమైందన్నారు. ఎన్నో ఒత్తిళ్లు ఉన్నప్పటికీ, ఇచ్చిన మాటకు కట్టుబడి సోనియా గాంధీ గారే తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని ఆయన స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల అధికారంలో తెలంగాణ ఉద్యమకారులను తీవ్రంగా మోసం చేసిందని మధు విమర్శించారు. అయితే, రేవంత్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యమకారుల కుటుంబాలకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే అమరవీరుడు శ్రీకాంతాచారి తల్లికి కార్పొరేషన్ పదవి ఇచ్చి గౌరవించుకున్నామని, అలాగే కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, సీనియర్ నాయకులు చిలుక రమేష్, కూరగాయల కొమురయ్య, కౌన్సిలర్లు తోట రాజు, కొండ శేఖర్, అన్నారం శ్రీనివాస్, ఇప్పపూల అజయ్, రామతీర్థపు హరీష్, కో–ఆప్షన్ సభ్యులు పీర్ మహమ్మద్, పార్టీ నాయకులు పులి రాంబాబు గౌడ్, ముప్పిడి శ్రీనివాస్, ముప్పిడి శ్రీధర్, దాడి మల్లేశం, జడల శ్రీనివాస్, కుతాడి రాజేశం, లింగంపల్లి కిరణ్, వరజి మల్లేశం పాల్గొన్నారు.

# పోలీస్ కమిషనరేట్‌లో రాష్ట్ర అవతరణ వేడుకలు

**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు వరంగల్ అదనపు డీసీపీ రవి గారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కమిషనరేట్ కార్యాలయ ఆవరణలో ఆయన ఘనంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీస్ వందనం స్వీకరించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు. జెండా ఆవిష్కరణ అనంతరం అదనపు డీసీపీ రవి గారు అక్కడికి విచ్చేసిన చిన్నారులకు, పోలీస్ అధికారులకు మరియు సిబ్బందికి మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అందరికీ రాష్ట్ర అవతరణ దినోత్సవ ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో వరంగల్ పోలీస్ యంత్రాంగం ఎల్లప్పుడూ ముందుంటుందని, రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు డీసీపీ సురేష్, ఏసీపీలు నాగయ్య, డేవిడ్ రాజు, పరిపాలనాధికారి సంపత్ కుమార్‌లతో పాటు పలువురు ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఇతర పోలీస్ అధికారులు, కమిషనరేట్ పరిపాలనా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

# సోనియా గాంధీ నిర్ణయంతోనే తెలంగాణ సాకారం

**హసన్‌పర్తి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** దశాబ్దాల పోరాటాలు, 60 ఏళ్ల తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర ఆకాంక్షను గుర్తించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాకారం చేసింది నాటి యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ గారేనని గ్రేటర్ వరంగల్ 66వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కనపర్తి కిరణ్ కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు హసన్‌పర్తి బస్టాండ్ ఆవరణలో మంగళవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కనపర్తి కిరణ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కనపర్తి కిరణ్ మాట్లాడుతూ.. నాడు కాంగ్రెస్ పార్టీ రాజకీయ లాభనష్టాలను పక్కన పెట్టి, ఇచ్చిన మాట ప్రకారం ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రసాదించిన నిజమైన 'తెలంగాణ తల్లి' సోనియా గాంధీ అని కొనియాడారు. రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న ఇందిరమ్మ రాజ్యంలో అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా తెలంగాణను సర్వతోముఖాభివృద్ధి పథంలో నడిపించడమే కాంగ్రెస్ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆరెల్లి వెంకటస్వామి, ఎల్ఐసి వెంకన్న, మీడియా ఇన్‌ఛార్జ్ బిగుల్లా సురేష్, పెద్దమ్మ నరసింహారాములు, దూడల ప్రకాష్, శీలం రమేష్, జన్ను రమేష్, మేకల ఆనంద్, గరిగె రాజు, డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అచ్చంపేటలో 'తెలంగాణ ఆవిర్భావ' వేడుకలు



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని అచ్చంపేట పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మనోహర్ ముఖ్య అతిథిగా హాజరై, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. 14 ఏళ్ల సుదీర్ఘ ఉద్యమం, ఆ తర్వాత పదేళ్ల ప్రగతి శీల పాలనతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దారని కొనియాడారు. తెలంగాణ తల్లి సంకెళ్లు తెంచిన రణధీరుడు, స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసిన అజేయ శక్తి కేసీఆరేనని స్పష్టం చేశారు. గతంలో రాష్ట్రం ఎదుర్కొన్న చీకట్లను, పవర్ హాలిడేలను రూపుమాపి.. గృహ అవసరాలకు, పరిశ్రమలకు 24 గంటల నిరంతర విద్యుత్ అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని మనోహర్ గుర్తుచేశారు. 79 ఏళ్ల స్వతంత్ర భారత దేశ చరిత్రలో రైతు సంక్షేమం కోసం వ్యవసాయానికి 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్ అందించిన ఏకైక నాయకుడు కేసీఆర్ మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అమినోద్దీన్, మున్సిపల్ మాజీ చైర్మన్ తులసీరాం, మండల పార్టీ అధ్యక్షుడు పర్వతాలు, తాజా మాజీ కౌన్సిలర్లు మను పటేల్, రమేష్ రావు, పార్టీ నాయకులు బెల్లి బాలరాజు, జిలకర సాంబశివయ్య, సుల్తాన్, సోషల్ మీడియా ఇంచార్జి పిల్లి బాలరాజుతో పాటు బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# అమరవీరుల త్యాగాలు, కేసీఆర్ పోరాటంతోనే స్వరాష్ట్ర సాకారం

• వేములవాడలో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అక్కడ ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ.. 60 ఏళ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, అమరవీరుల ఉజ్వల త్యాగాలు, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సాగించిన అలుపెరగని సుదీర్ఘ పోరాటం వల్లే ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందని కొనియాడారు. కేసీఆర్ నాయకత్వంలోని పదేళ్ల సుపరిపాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో ఊహించని విధంగా అభివృద్ధి చెంది, దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలిచిందని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనపై చల్మెడ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారిపోయిందని, రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే తరుణంలో ఆంధ్ర పాలకులు మళ్లీ నీళ్ల దోపిడీకి తెరలేపుతూ రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేయడానికి కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజలంతా అప్రమత్తంగా ఉండి, మన అస్తిత్వాన్ని, హక్కులను కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వైభవంగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** అచ్చంపేట మండలం పులిజాల గ్రామంలో బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలు పండుగ వాతావరణంలో జరిగాయి. నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవన ప్రారంభోత్సవం, అలాగే లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల కార్యక్రమానికి అచ్చంపేట నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక సర్పంచ్ ఇమ్మడి వెంకటయ్య, ఉపసర్పంచ్ రమేష్, శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం చైర్మన్ బీరం మాధవరెడ్డిల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ రిబ్బన్ కట్ చేసి నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నియోజకవర్గంలోని ప్రతి పేద కుటుంబానికి చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి గ్రామపంచాయతీ భవనాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేదవాడి సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేస్తోందని ఆయన కొనియాడారు. అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత మల్లేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పులిజాల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.